## పెద్ద కథ

# కర్తవ్యం

'ఇది మీ చివరి నిర్ణయమా'

మాధురి ముఖం చూడటానికి కూడా శక్తి చాలక ఆమె వైపు వీపుపెట్టి నిలబడిన సునీల్ అప్రయత్నంగా ఆమెవైపు తిరిగాడు. మాధురి కళ్ళనిండా పొర్లి వెక్కిళ్ళమించి ధారలు కట్టే కన్నీటిని తుడిచి, ఆమెను దగ్గరగా లాక్కుని గుండెల్లో కంటూ హత్తుకు ఓదార్చా లన్పించే కోరికని బలంగా అదుము కొన్నాడు సునీల్.

'నేనేం చెయ్యను మాధురీ...అమ్మ కెట్లా చెప్పను...మన కులాలు ఒకటికాదు'

'అవునవును నాతో స్నేహానికి అడ్డురాని కులం నా బ్రతుకుని పంచుకోనేందుకు...'

'ఆగు మాధురీ' అరిచాడు సునీల్. 'ఒక్కటి చెప్పు మాధురీ... పుస్తకాలు తప్ప మరో ప్రపంచం ఎరగని నన్ను... అమ్మ విద్యార్థినిగా పరిచయమై, నువ్వే నన్ను బయటకు లాక్కొచ్చావు. ఇప్పుడు నన్నిట్లా అసేయటం నీకు బావుందా మాధురీ నీతో నే నెప్పుడైనా తప్పుగా ప్రవర్తించానా'...

ఒకలాంటి గొంతుతో అడిగాడు సునీల్.

'అంటే—మీరు నన్ను అభిమానించలేదా. నేనంటే మీకేం లేదా...చెప్పండి సునీల్... ఒక్కసారి చెప్పేయండి. ఎంకెప్పుడూ మీకు కన్పించను. నా నీడకూడా మీ జీవితంలో కన్పించనంత దూరంలో...భగవాన్...ఏం మగవాళ్ళు...' మాధురి దోసిట్లో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. క్షణంసేపు ఆమెను వెడల్పు కళ్ళతో చూసాడు సునీల్. 'ఈ మాధురి తనకేం కాదా...కాదు అని చెప్పి మనసు చంపుకొని మాధురిని వదిలి బతకగలడా తను' కానీ... అమ్మ కెట్లా చెప్పటం...భగవాన్ నన్నింత దుర్బలుడ్ని చేశా వెందుకూ...'

'క్షమించండి... మాధురీ మీకు తెల్సుగ నా నిస్సహాయత. నాకు కొంచెం టైమ్ కావాలి...అమ్మతో చెప్తాను మన సంగతి... ప్లీజ్...మీరు బాధపడకండి... నన్ను అర్థం చేసుకోండి మాధురీ...' ఎలాగో అయిపోతూ అడిగాడు సునీల్.

'బాబూ...సునీ.'

'ఏమ్మా...కర్టెన్ తొలగించుకొని బయ



టకు వచ్చి హుందాగా గుమ్మంముందు నిల బడ్డ కొడుకుని క్షణంసేపు చూసుకొంది ఆవిడ. తెల్లగా, సూర్యకిరణం లాంటి రూపం, తెలివితేటల్ని ప్రతిబింబించే కళ్ళు విజాయితీఅయిన వాడిలా నిటారుగా నిల బడ్డ ముక్కు, క్రాపులోంచి జారి నుదురు మీద పడ్తూన్న వుంగరాలజుట్టు, చూడగానే గౌరవించాలన్పించే విగ్రహం. చేతిలో చదువుతూన్న పుస్తకం...అంతా తండ్రి పోలికే.

ఆనంద తరంగితంఅయింది ఆవిడ మనసు.

'ఏమిటమ్మా' తల్లిని చూస్తూ మరో సారి పిలిచాడు సునీల్.

'ఒకసారి గదిలోకి రా... నీతో కొంచెం మాట్లాడాలి'

'ఒక్క క్షణం' అతను లోపలకు వెళ్ళి పుస్తకం టేబిల్‌మీద పడవేసి తల్లి వెంట నడిచాడు.

తనయ వెన్నెల లోకాన్ని చల్లగా ముం చెత్తుతోంది. తారలు మెరిసిపోతున్నాయి. రాత్రి పదైఅయింది. మూసివున్న గ్లాస్‌షటర్స్ మీంచి జారుతున్న మంచుతెరలు వెన్నెలని కప్పడానికి విఫల యత్నం చేస్తున్నాయి. పైన తిరుగుతూన్న సీలింగ్ ఫాన్ సన్నగా శబ్దంచేస్తూ తిరుగుతోంది.

'మాధురి అంతా చెప్పింది బాబూ...'

'అమ్మా...' సునీల్ ఊపిరి పీల్చడానికి కూడా భయపడ్తున్నవాడిలా అయ్యాడు...

'ఏవో కులాలు మతాలు అన్నావుట...' ఆవిడ పెదవుల చివర చిరునవ్వు మెరి సింది..

'అది కాదమ్మా...' గొంతు పెగిలించు కొని ఏదో చెప్పబోయాడు సునీల్.

'ఏది కాదు సునీ...అసలు మీ మగవాళ్ళే అంత. ఆడదాని హృదయం అర్థం చేసు కోరు. పైగా నిందలు వేసేందుకు కూడా వెనకాడరు. కానీ నా పెంపకంలో పెరిగిన నువ్వు కూడా మామూలు మగవాడిలా మాట్లాడావ్...అదే నాకు బాధగా వుంది.'

సునీల్ ఏం సమాధానం చెప్పలేదు. అతను తల దించుకొని గాజు పేపర్ వెయిట్‌లో రక రకాల రంగుల్ని పరీక్షగా చూస్తున్నాడు. అందువల్ల అతని ముఖంలో భావాలు చదివే అవకాశం ఆవిడకి లేకుండా పోయింది. తర తరాలుగా అనుశ్రుతంగా వస్తూన్న మత

# కర్తవ్యం

అహంకారానికి మరో వారసుడు ఈ సునీల్. అంతేనా...ఇదేనా తను ఆశిం చింది. ఏకులమతాల ప్రసక్తికి దూరంగా వాడిని పెంచాలనుకొందో అదే గట్టో ఎట్టా పడ్డాడు.

ఆవిడ అంది. 'నీకు ఓ కథ చెప్తాను వింటావా బాబూ...'

'కథా...ఏవరిదమ్మా' సునీల్ ఆశ్చర్యంగా చూసాడు.

'ఏవరిదయితేనేం బాబూ. విను నీకే తెలుస్తుంది... ఓ అభాగ్యురాలిగాథ ఇది'

* * *

'వనితా విహార్' సెక్రటరీ మిస్. కుముద మైకు దగ్గర నిలబడి ఉంది. 'ఈ రోజు మనకి చాలా మంచిరోజు' ఎందుకంటే మన అభిమాన రచయిత్రి కుమారి సంధ్యారాణిగార్ని సన్మానించాలన్న సూచనని మా వనితా విహార్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించి, ఈరోజు ఆ అదృష్టాన్ని నిజం చేసుకొనే అవకాశం రావటం నిజంగా మాకెంతో ఆనందాన్ని కలిగిస్తోంది. సంధ్యగారిని గురించి నేనేం వివరించి చెప్పనక్కరలేదు. ఆంధ్రుల అభిమాన రచయిత్రి, ఆరాధ్య చిత్రకారిణి, మధుర గాయని, స్నేహశీలి, నిగర్వి అయిన ఆమె వ్యక్తిత్వం మేరునగధీరం. లలితకళలు భగవంతుని వరాలు. ఆ వరాల నెన్నింటినో కలిగివున్న మన సంధ్యారాణిగారు నిజంగా ఓ అపూర్వ వ్యక్తి.' స్టేజంతా లైట్లతో వెలిగిపోతోంది. విశాలమైన ఆవరణలో బారులుతీరి నిలబడ్డకార్లు లైట్ల వెలుగుల్లో తళతళలాడుతున్నాయి.

స్టేజి కటూ ఇటూ హుందాగా వ్రేలాడు తూన్న పసుపు పచ్చని వెల్వెట్ కర్టెన్లు, స్టేజిపైన ఆర్చి ఆకారంలో ఆ చివరినుంచి ఈచివరివరకూ వచ్చేట్టున్న 'ఆంధ్ర వనితా విహార్' అనే అక్షరాలు రక్తవర్ణంలో చూడగానే కళ్ళని ఆకట్టు కుంటున్నాయి. ఇసుక వేస్తే రాలనంతగా వున్నారు జనం.

'ఇప్పుడు కుమారి సంధ్యారాణి వేదిక అలంకరిస్తారు' కుముద చెప్పింది. హర్ష ధ్వానాలమధ్య, కుముద, ప్రెసిడెంట్ కమలావతి అటూ ఇటూ నడుస్తుంటే నెమ్మదిగా వేదికపైకి వచ్చింది సంధ్య.

తెల్ల నీలిరంగు పట్టుచీరకు ముదురు నీలం రంగు చక్కటి హంసల బార్డున్న బోర్డరు, తెల్ల నీలంరంగు బ్లవుజు. మెడమీద కంటూ జారినట్లున్న సిగలో ఒపక్కగా నవ్వుతూన్న తెల్లగులాబి, నుదుట గుండ్రని కుంకుమ అందమైన చిరునవ్వుతో నిరాడంబరంగా వున్న సంధ్యని చూస్తూ మరింత హర్షం వెలరేగింది జనంలో. వనితా విహార్ ప్రెసిడెంట్ ఓ మంత్రిగారి భార్య. ఆవిడవచ్చీరాని ఇంగ్లీషులో ఏలాగో గొణుగుతున్నట్లుగా ప్రసంగం అయిందని పించింది.

'ఇప్పుడు సంధ్యారాణి తమ అమూల్య సందేశం ఇస్తారు మనకి' కుముద గొంతు శ్రావ్యంగా పలికింది.

సంధ్య చిరునవ్వుతో మైక్ ముందు నిలబడింది. తన రచనలని, చిత్రాలనీ అమి తంగా ఆదరిస్తున్న పత్రికలకీ సంపాదకులకీ తన కృతజ్ఞత తెల్పుకొంది తన రచనల్లో లోపాల్ని విమర్శించి తను ఇంకా మంచి రచనలు చేసేలా సహాయపడవలిసిందిగా సద్విమర్శకులని కోరింది. అల్పురాలయిన తనని అట్టహాసంగా సన్మానిస్తూన్న వనితా విహార్‌కి తను ఋణపడి వున్నాను, అంది. తన విజయాలకి ముఖ్యకారకులైన తన స్నేహితురాలు వాసని ఆమె భర్త మాధవ్, నిజంగా ఈ గౌరవం అంతా వాళ్ళకే చెందు తుంది, అంది. ఆమె మాటల్ని అందరూ చాలా నిశ్శబ్దంగా కూర్చుని అత్యంత ఆసక్తిగా విన్నారు.

ముందు వరుసలో వాసని ప్రక్కగా మాధవ్ తలతిప్పి ఒకళ్ళ 'ముఖాలు ఒకళ్ళు చూసుకొని అప్రయత్నంగా నిట్టూర్చారు. ఈనాడు తమ స్నేహితురాలికి జరుగుతున్న సన్మానం వాళ్ళని అమితంగా ఆనంద పరుస్తున్నా, దానివెనకే ఏదో విషాదం వాళ్ళ మనస్సులని స్పృశించింది క్షణంసేపు.

'అమ్మదగ్గరికి పోతా...' వాసని చేతు ల్లోంచి ముందుకు దూకుతున్నాడు రెండేళ్ళ సునీల్‌బాబు. వాడిని ఆపటం వాసని వల్ల కావటంలేదు

'తప్పు నాన్నా — అల్లరి చేయకూడదు. అమ్మ వచ్చేస్తుంది వుండు' బలవంతంగా వాడిని పట్టుకొని అపుతూ నీతులు బోధి స్తోంది కొంచెక్కి వాసని.

'పాటేమయినా పాడాలి మీరు' కుముద

సంధ్య సమీపంగా వచ్చి అంది చిన్న గొంతుతో:

'నేనా...?' మాట్లాడ్డం ముగించి వెనక్కి తిరుగుతూన్న సంధ్య క్షణంసేపు తెల్లబోయింది.


'సారీ కుముదా' అంది పాడలేనన్నట్టు తలతిప్పుతూ.

'అల్లా వీల్లేదు. మీరు పాడాల్సిందే..'

కుముద శాసిస్తున్న చిరునవ్వుతో అని సంధ్య పక్కగా నిలబడి మైక్‌లో చెప్పింది.

'సంధ్యారాణిగారిని ఒక పాట పాడవలసిందిగా మీ అందరి తరఫున నేను కోరుతున్నాను. మన కోరిక నెరవేరుతుందనే ఆశిద్దాం...'

సంధ్యకి ఇంక తప్పలేదు. ఆమెవయిపే



# కర్తవ్యం

చూస్తున్న మాధవ్ కళ్ళతో ఆమెచూపులు ఒక్కసారి కలిసి మెరుపులా విడిపోయాయి.

కృష్ణా...మాధవా... అ...
నీ రాధను నీ ఆరాధనను
నను మరచితివా ప్రభూ
నీకోసం ఎదురు చూసి
కనుల నీరు తొణికేను
నీకై వెదకి వెదకి
ఎద వేగి పోయేను
హృదయ మోహనా ఏది
నీ మురళీ రవళి
ప్రేమార్ద్రమైన నా మది పులకరింప
మ్రోయించు నీ మురళి
మ్రోయింపవూ వంశి...

సంధ్య గొంతులోంచి ఆ పాట మధురంగా తరంగమై ప్రతి గుండెలోనూ నిండిపోతోంటే మాధవ్ గుండె గాలానికి చిక్కుకున్న చేపపిల్లలా గిలగిల లాడింది. ఆతని మనసు గతంమీది సమాధిని బలంగా పెళ్ళగించుకొని పైకంటా పొంగింది. ఆనాడు ఇదే పాటతో తన హృదయం మీటింది సంధ్య. ఇదే చిరునవ్వుతో తనని శాసించేది. కానీ — 'ఇప్పుడు ఆ సంధ్య నా సంధ్య...' చివ్వున పొంగిన మనసుని వివేకం కిందకి అదిమింది. 'ఈ సంధ్య ఇక తనది కాదు. అదంతా ఓ మధురమైన కల అంతే...అంతే...' మాధవ్ మనసు బాధగా మూలిగింది.

వాసవి నిమిషంసేపు భర్త ముఖంచూసి తన చెయిచాపి అతని చేతిమీద వేసింది. ఆ స్పర్శతో ఓదార్పుని చూడగలిగిన మాధవ్ తెప్పరిల్లి సిగ్గుపడ్డాడు. వాసవికి అంతా తెల్సు. మోహాలు ఆడదాని మనసులా కాక వింతో ప్రశాంతంగా ఆలోచించగలిగే వాసవి భర్త మనసులో చెలరేగే సంక్షోభం చాలా తేలిగ్గా అర్థం చేసుకోగలదు.

'ఇంకా నయం. వాసవి ఉన్నదురా తనకి సరిపోయింది. అదే మరొకరయితే...' ఆ పైన ఆలోచించడానికే భయం వేసింది మాధవ్‌కి.

తనేం అనుకొంటున్నాడూ ... ఇన్నేళ్ళ తర్వాతయినా తన మనసు ఆ పాట వినేసరికి ఎందుకింతగా కదలిపోతూందీ...!... తనకీ ఓ సంసారం వుంది. తన వరధి వేను. వాసవి తనని ప్రేమించి పెళ్ళి చేసుకొంది. దైవంలా ఆరాధిస్తోంది. తన ఆరాధన సంధ్యకే పరిమితం అయినా ఇహలౌకిక సుఖాలు వాసవితోనే ముడిపడ్డాయి. రెండేళ్ళ సునీల్ తమ ప్రేమ ఫలం. అలాంటప్పుడు తను ఇలా...అసహ్యంగా...' మాధవ్ ఛప్పున తల విదిలించి వాసవి వళ్ళోంచి సునీల్‌ని తన దగ్గరకు తీసుకొని వాడితో కబుర్లు చెప్తూ కూర్చున్నాడు. తర్వాత సంధ్యకి సన్మానం జరిగింది.

ఆ సందు తర్వాత సంధ్య చుట్టూ చేరి రకరకాల ప్రశ్నలు వేయసాగారు వనితా మిత్ర సభ్యులు. సునీల్‌ని వళ్ళో కూర్చోబెట్టుకొని వాళ్ళకి సమాధానాలు చెప్తోంది సంధ్య.

'క్షమించాలి సంధ్యగారూ...మీరు చాలా ఎక్కువగా కులాంతర వివాహాలు సమర్థిస్తూ రాస్తారు. అవి అంత ఆరోగ్యకరమైనవంటారా...?'

సంధ్య కలవరపాటుగా తలెత్తింది. 'ఎందుకలా అనుకొంటున్నారూ...? వివాహం వెయ్యేళ్ళ పంట. ఏ వర్ణమయినా దాని విలువ మారదుగా.'

'అది కాదు. ఉదాహరణకి అతను మాంసాహారి, ఆమె శాఖాహారి అనుకోండి. ఎట్లా సరిపోతుంది ... వాళ్ళు సర్దుకుపోయినా... పిల్లలు ఏ కులానికి చెందుతరూ ?... సంఘంలో వాళ్ళ స్థానం ఏమిటి ? ప్లీజ్ రచయిత్రిగా మీ అభిప్రాయం...'

ఒకనాడు సరిగ్గా ఇలాంటి ప్రశ్నలోనే తనని సజీవసమాధి చేసింది సమాజం. అందుకు ఫలితంగా ఈనాడు కదిలే శవంలా యంత్రంలా జీవిస్తోంది తను. సంధ్య పెద్ద కళ్ళల్లో నీళ్ళు వూరాయి. ప్రక్కగా కూర్చున్న వాసవిని ఒకసారి చూసి బలవంతాన నవ్వింది సంధ్య.

'చూడండి. కులాంతర వివాహాల గురించి నా అభిప్రాయం నా రచనల్లో చదువుతూనే వున్నారు కదా. మనసులు కలిసినప్పుడు, శాశ్వతంగా కలిసి బ్రతకాలను కున్నప్పుడు వాళ్ళ మధ్య మమత బంధం వేసినాడు ఆ జీవశక్తి వ్యక్తిత్వంలో ఏ లోపం. పొరపొట్లు కల్పించవు. మనసు లేనప్పుడు మనుష్యులు ఒకే వర్ణమైనా ఒకే కులమయినా వాళ్ళని కలిపే శక్తి ఏ కులానికీ, మతానికీ వుండదు. కులమతాలే జీవితానికి ప్రాతిపదికలు కావు. మనిషిని మనిషిని బంధించేది మనసు. అనురాగ హృదయానికి అపజయం ఎప్పుడూ వుండదు. జీవితం నీటి బుడగ అయితే అందులో విరిసే ఏడురంగుల ఇంద్రధనస్సు మనసు. ఆ సప్తవర్ణాల ప్రతిబింబాలే జీవికకు ప్రాణం పోసేవి. ఆ సుస్వరాలే మనిషి జీవితంలో ప్రత్యూష బిందువులు. కష్టసుఖాల కట్టడాల అడుగునుంచి మనిషిని నడిపించేదీ, సజీవంగా గుండెలో స్పందించేదీ అనురాగం ఒక్కటే. మనుష్యులతోపాటే మార్పు చెందే వ్యవస్థ కాలానుగుణ్యంగా తన రూపాన్ని మార్చుకొంటుంది. ఒకనాడు స్త్రీ విద్య నిషేధించిన పెద్దలే ఈనాడు తమ ఆడపిల్లల్ని కాలేజీకి ఏట్లా పంపిస్తున్నారంటారూ ఇప్పుడూ...అభిప్రాయాలన్నవి స్థిరమైన కోటలు కావు. ఎంతటి పటిష్ఠమయిన సంఘ వ్యవస్థ అయినా క్రొత్త అనే తుఫానుకి కదలిపోయి కూలిపోతుంది. అందుకే మార్పన్నది మనుష్యులలోనే వస్తుంది. అలాంటిది ఇంతగా అభివృద్ధి చెందిన ఈ తరంలో కూడా ఇంకా వర్ణభేదాలు వున్నాయంటారా ...? ...మా సునీల్ కాలానికి చూడండి. మానవత్వమే కులం అవుతుంది. మంచే మతం అవుతుంది. అలాంటి బంగారుకాలం మన ముందు తరాలయినా చూడాలనే ఆశిద్దాం. మన తరంలో సంకుచిత అభిప్రాయాలు ఈ పసివాళ్ళకయినా అంటకుండా వుంటే ...మనం అంతరిక్షంలో కంటూ ఎగిరి వెళ్ళే...'

'ఎంత చక్కగా చెప్పారండీ...' నిశ్శబ్దంగా విన్న వాళ్ళందరిలోంచి ఒక్కసారిగా ప్రశంస విన్పించింది.

'క్షమించాలి సంధ్యగారూ. మీరు కుమారిగానే వుండటానికి కారణం...?'

'మీ పెళ్ళెప్పుడు సంధ్యా ..మీరు ప్రేమ వివాహం చేసుకొంటారా లేక పెద్దలు నిర్ణయించిందా ?'

'ఇన్ని చెప్పారు మీకు మనసున్న మంచి యువకుడు తటస్థపడితే కులం గోత్రం అంటారా ... లేక మనసే ముఖ్యం అంటారా ?'

ఒక్కొక్క ప్రశ్న వచ్చి ఈ పెళ్ళి మనసుని గాయపరుస్తున్నా సంధ్య చిరునవ్వే సమాధానంగా చేసింది.

'రండి సంధ్యారాణీ. మా వనితా విహార్ చూద్దురుగాని,' కుముద వెంట పైకి లేచింది సంధ్య.

*　　*　　*

ఆ రాత్రి మాధవ్‌కి నిద్రరాక డ్రాయింగ్ రూమ్‌లో టేప్ రికార్డర్ ఆన్ చేసుకొని లైటు తీసేసుకొని సోఫాలో వెనక్కి జార్లా పడి కూర్చున్నాడు. టేప్ రికార్డ్‌లోంచి సంధ్య గొంతు శ్రావ్యంగా, హాయిగా వినిపిస్తోంది.

'కృష్ణా...మాధవా—' విప్పిపోర్లు వినిపించి ఇంకా ఇంకా వినాలనిపించేలా ... సంధ్యా... ఎన్ని యుగాలైనా నిన్ను మర్చిపోగలనా... మంచంమీద నిద్రరాక కొట్టుకొంటోన్న వాసవి ఆ పాట వింటూనే వుంది. వాళ్ళ మనసులు అప్రయత్నంగా గతంలోకి జారాయి.

*　　*　　*

ఆ రోజు యూనివర్శిటీ వార్షికోత్సవం. అనారోగ్య కారణంగా రెండు నెలలు సెలవు పెట్టి ఇంటికి వెళ్ళిన మాధవ్ ఆరోజే తిరిగివచ్చాడు.

ప్రైజులు ఇవ్వటం మొదలు పెట్టారు. అన్నింట్లో చాలామటుకు ఫస్టుప్రైజ్, మిగతా వాటిల్లో సెకండ్ ప్రైజ్ అయినా విధిగా అందుకొంటున్న ఓ అమ్మాయి అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆఅమ్మాయి పేరు సంధ్యారాణి ఫైనల్ బి.య్యస్సి. చదువుతోంది. మాధవ్ ఫైనల్ ఎమ్మెస్సీ చదువుతున్నాడు. ఆడపిల్లలని ఏడ్పించడం హీరోయిజం అయిన ఈ రోజుల్లో ఏ అమ్మాయివైపూ కన్నెత్తయినా చూడని మాధవ్ అంటే ఆడపిల్లలందరికీ బాగా ఇష్టం. వాళ్ళు అతన్ని స్టేజ్ ఎక్కించి పూలమాలవేయటం అన్నీ మనసులోనే చేసేసి పద్మశ్రీ, నెహ్రూ యన్, అమాయకుడు, అన్నయ్యలాంటి బిరుదులతో సత్కరించేశారు.

లలిత సంగీతంలోకూడా ఫస్ట్ ప్రయిజ్ తెచ్చుకొన్న సంధ్య మైకుముందు నిలబడింది ప్రొఫెసరు గారికవిఖాదట. 'ఆ అమ్మాయి పాట వింత బాగుంటుందో...' కుతూహలంగా చూసాడు మాధవ్.

'కృష్ణా... మాధవా'

సంధ్య గొంతులోంచి ఆ పాట వీణానాదంలా పారే సెలయేరులా అందరి గుండెల్లోనూ తీయని కెరటంలా విరిడిపడేలా చేసింది. తర్వాత ఇంకో మూడు పాటలు పాడింది సంధ్య. అయినా మొదటిపాటే బాగా వచ్చింది మాధవ్‌కి, ఒక్కసారి ఆ అమ్మాయిని అభినందించి రావాలనే కోరికని ఆపుకోలేకపోయాడు అతను. ఇంతలో వాసవి ప్రక్కగా నడుచుకువస్తోన్న సంధ్య, మాధవ్ కంట పడింది.

'వాసూ...'

ఆ పిలుపు వింటూ తలతిప్పి మాధవ్‌ని చూసిన వాసవి కళ్ళల్లో కోటిదీపాలు వెలిగాయి.

'ఓ ..మీరెప్పుడు వచ్చారూ'—?

'ఈ రోజే...'

'ఆరోగ్యం బాగుందా...'

'ఆఁ...బాగానేవుంది' నవ్వాడు మాధవ్.

'చూడు సంధ్యా ఈయన నా ఫ్రెండ్ మాధవ్ ఎమ్మెస్సీ ఫైనల్... అమ్మాయిని పరిచయం చేయక్కర్లేదు ... చూస్తున్నారుగా ఇందాకట్నుంచి. అయినా చెప్తాను. ఈ అమ్మాయి సంధ్యారాణి ఏ జాక్ ఆఫ్ ఆల్.' వాసవి ఒకళ్ళనొకళ్ళకి పరిచయం చేసింది.

క్షణంసేపు వాసవి పరిచయం తీరుకి ఆశ్చర్యపోయాడు మాధవ్. అతను వాసవికి మేనత్త కొడుకు. కాని మాధవ్ తల్లి అహంకారం వాసవికి నచ్చదు లక్షలుండగానే సరా, మర్యాద వుండాలి అంటుంది వాసవి. పూటకి గతిలేనివాళ్ళు ఎందుకైనా మంచిదని అన్నగారి కుటుంబాన్ని అల్లంతదూరంలో వుంచుతుంది మాధవ్ తల్లి. అందుకే వాసవి తనని బావగా గాక ఓ స్నేహితుడిలా పరిచయం చేసింది.

మాధవ్ పెదవుల్లోకి చిరునవ్వు తెచ్చుకొన్నాడు.

'నువ్వన్నది నిజం వాసూ. చూస్తూనే వున్నా ఇందాకట్నుంచి ప్రైజ్ లన్నీ మీ ఫ్రెండే తీసేసుకొన్నారు' 'మీరు మొదట పాడిన పాట ఎవరు రాసిందండీ చాలా బాగుంది' సంధ్య నుద్దేశించి అడిగాడు మాధవ్. వాసవి జవాబు చెప్పింది.

'ఆ పాట మా సంధ్యే రాసిందండీ తను కవి కూడా'


"ఏ. సీ' మాధవ్ ప్రశంసగా చూసాడు. 'చాలా బాగుందండీ.'

'థాంక్యూ.' సంధ్య సిగ్గు పడుతూ నవ్వింది.

అలా పరిచయం అయిన సంధ్య మాధవ్ హృదయదేవత అయింది. రోజూ సాయంత్రం అవుతూనే పార్కులో కలుసుకొనేవారు సంధ్య, మాధవ్ వాసవి.

'ఒక్కరోజు సంధ్య కన్పించకపోతే ఎంత కొట్టుకొనేవాడిరో — ఏమయ్యాయి ఆ క్షణాలు...' మాధవ్ కనురెప్పలు తడిగా కిందికి వాలాయి.

(ముగింపు వచ్చేవారం)



## పెద్దకథ:

# కర్తవ్యం



కుమారి పి. పద్మజవాణి

(గత సంచిక తరువాయి)

వనితావిహార్ వాళ్ళ మాటలు పదే పదే సంధ్య చెవుల్లో ప్రతిధ్వనించ సాగాయి.

'మనసున్న యువకుడు ఎదురయితే— పెళ్ళి చేసుకొంటారా లేక కులం గోత్రం అంటారా...' సంధ్య గుండెల్లోంచి వేగంగా ఓ నిట్టూర్పు వెలువడింది.

'మనసు ఇంకా ఎక్కడుందీ ... అది ఏనాడో చచ్చిపోయింది. ఇప్పుడు మిగిలింది రాయి. దానికి ఏ అనుభూతులు వుండవు. ఎలాంటి స్పందన ఏం ఆ వేగం వుండవు. ఆ రోజు...ఆ రోజు తలచుకుంటే [illegible]-పోటులా సమాజం తన బ్రతుకుని కసిగా నలిపేసిన రోజు. జీవితంలో బాగా సంతోషం కలిగించే గుర్తులు ఎంతగా దాచుకుంటామో బాధ కలిగించే సంఘటనలూ అంతగానూ, మనం మరచిపోదామన్నా... మనసులో ఏ మూలో దాక్కొని అప్పు డప్పుడూ పైకి వచ్చి ఏడ్పిస్తూంటాయి.

'అతన్నెట్లా చేసుకొంటావమ్మా...అతను మన కులం కాదు.'

'క్షమించండి నాన్నా. నాకా విషయం ముందుగా తెలీదు. తెలిసుంటే సంగతి నేనేం చెప్పలేను. కానీ ... ఇప్పుడు నేనేం చెయ్యలేను నాన్నా...అతన్ని తప్ప ఇంకెవర్నీ చేసుకోలేను. చేసుకొని బ్రతకలేను నాన్నా.'

తల వంచుకొని గబ గబా ఎలాగో చెప్పేస్తూన్న కూతుర్ని చూసి షాక్ తిన్నారు రావుగారు.

'సంధ్యా ... నువ్వు అంతగా కావాలను కొంటే నీ ఇష్టం తల్లీ. నా స్వార్థంకోసం కన్నబిడ్డ బ్రతుకులో నిప్పులు పోసేటంత నీచుడ్ని కాదమ్మా...కులం సంగతి వదిలేయ్. అతను మాంసం తింటాడు, నీకు కోడిగుడ్డు చూస్తేనే వెగటు. ఆహారం దగ్గర్నుంచి, సంప్రదాయాలవరకూ అంతా మార్పే. ముందు అనుకొన్నంత హాయిగా వుండదమ్మా అలాంటి వాతావరణం.'

చెరు పూరుకోతడి. 'అసలు అలా ఇలి మెల్లిగా చెప్పి నెత్తికెక్కించుకొన్నారు వాళ్లాళ్లా. అందుకే అదలా దానిష్టం వచ్చినట్టు పూరేగుతోంది. సంధ్యా పెద్ద దానివి. ఆలోచించుకొనే వయసు లేదా నీకు...? కులంకాని వాడిని మొగుడ్ని కట్టు కొంటే మేం ఏ గంగలో దూకం...? అది కూడా చెప్పి పుణ్యం కట్టుకో.'

'అమ్మా.'

సంధ్య కన్నీళ్లు చూసి ఆ మాతృ హృదయం కప్పుకొన్న కఠినత్వపు పొర కరగి పోయింది. ఆవిడ చేతులు చాపి సంధ్యని గుండెల్లోకి చేర్చుకొంది.

'వద్దు తల్లీ. వంశానికి అప్రతిష్ఠ తేకు. నీ వెనక పెళ్ళిళ్లు కావాల్సిన చెల్లెళ్లు, పైకి రావాల్సిన తమ్ముళ్లూ, పరువుతో బతికే నాన్నగారూ...వద్దమ్మా...నీ ఒక్క దాని ఆనందంకోసం ఇందరి బ్రతుకులు బలి చేయకు.' ఆ తల్లి ఆవేదన అది.

'పెళ్ళి చేసుకోగానే సరికాదమ్మా, రేపు పుట్టబోయే పిల్లల భవిష్యత్తు ఆలో చించుకోవాలి. ఏమయినా ఇలాంటి వివాహాలు పైకి రావమ్మా.'

తల్లి మాటలు వెయ్యి గొంతులు పెట్టుకొని సంధ్యకి గంగ వెర్రి ఎత్తిం [illegible]

ఆ రోజు...గుండెలు బద్దలవుతూంటే ఇలాగో చెప్పింది మాధవ్‌కి.

'నన్ను క్షమించండి మధూ. మిమ్మల్ని బాధపెడుతున్నాను కదూ. పాపిష్టిదాన్ని. నన్ను మర్చిపోండి. నాలాంటి దౌర్భాగ్యు రాలు ఎవరికీ వద్దు.'

'అసలు అదేం కాదు సంధ్యా. ఇన్నాళ్లూ నాకు ఆశలు రేపి... చివరికి ...నేను...నేను కులం తక్కువ వాడినని కదూ.'

రోషంతో [illegible] కందిపోయింది మాధవ్ ముఖం.

అతని కళ్ళవైపు ముఖాన్ని పరిశీలనగా చూస్తే అవి నిజంగా హృదయంలోంచి వచ్చిన మాటలుకావని తెలిసిపోతోంది. ఒకో సారి అంతే. ఎదుటివ్యక్తి మనని అర్థం చేసుకోవటంలేదనే నిజం మనసుకి తెల్సినా ఆమాట ఆ వ్యక్తి నోటవెంట వింటే అదో రకమైన తృప్తి. మాధవ్ పెదవులు కఠి నంగా అన్నా ఆ కళ్ళల్లో కోపచ్ఛాయలు లేవు. తనది తక్కువకులం కావటంవల్లనే

# కర్తవ్యం

సంధ్య తనని నిరాకరించింది. తనతో స్నేహా నికి అడ్డురానికులం తన బ్రతుకుని పంచు కోటానికి అడ్డు వచ్చిందా' అనే ఒకలాంటి భావం వుంది.

'మాధవ్...' సంధ్యహృదయాన్ని ఎవరో పదునైన కత్తులు ఒకదాని ప్రక్కన ఒకటి బలంగా గుచ్చి పైకి లాగుతున్నట్టుగా విలవిలలాడింది.

'మీరూ అలాగే అంటున్నారా ... నా మనసు...మీకు తెలీదూ.'

కన్నీళ్ళ మధ్య ఏలాగో అన్న సంధ్య హఠాత్తుగా ముందుకువంగి మాధవ్‌పాదాల చుట్టూ చెయ్యివేసి అతని మోకాళ్ళమీద ముఖం వాల్చేసి బావురుమంది.

క్షణంసేపు చిత్తరపోయినట్టుగా అయి పోయాడు మాధవ్. సంధ్య కన్నీళ్ళు బొట్టుబొట్లు జారి అతని మనసులోనే నడసాగాయి.

'తనకు తెలియదూ సంధ్య మనసు. ఏదో బలహీనత, తనది తక్కువకులం అనేభావం సరసరాన జరజరా పాకి తనని ఇంత అల్పంగా మాట్లాడేలా చేసింది ఇన్నాళ్ళ స్నేహంలో సంధ్యని. తన దేవతని ఇంతేనా అర్థంచేసుకొన్నది. సరే... ఎన్నడూ పొరపాటునైనా తన చిటికెనవేల యినా తాకని సంధ్య ఈవేళ తన కాళ్ళ మీద వాలి ఏడుస్తోందంటే... అందుకు కారణం తను కాదూ... మాధవ్ ముఖం రక్తం లేనట్టు తెల్లగా పాలిపోయింది. అతను తనవల్ల ఎవరు బాధపడ్డా సహించలేడు. అందులో సంధ్యయితే మరీనూ. తన నిష్క్రమణవల్ల ఎవరికయినా ఆనందం కలుగుతుందంటే నవ్వుతూ ప్రాణాలయినా ఇచ్చెయ్యగలడు అతను. మరో క్షణంలో మాధవ్ మెరుపులా వంగి చేతులతో ఆమె భుజాల్ని పెనవేసి జీవితంలో మొదటిసారి చివరిసారి సంధ్యని బలంగా గుండెలకి హత్తు కొన్నాడు.

'నా సంధ్యా' అస్పష్టంగా వున్న ఆ పిలుపు యుగయుగాల అనురాగాన్ని, లాలనని మేళవించుకొంది. రెండునిమిషాల తర్వాత సంధ్య కొంచెంగా కళ్ళెత్తి ఒకసారి మాధవ్ ముఖంవైపు చూసి కళ్ళు వాల్చుకొంది. ఆమె చూపులు తన కన్నీళ్ళతో మాధవ్ గుండెలదగ్గర చాలా సేపటివరకూ తడిసిన చోట ఆగాయి. సంధ్య చూపుడు వేలితో ఆ ప్రదేశాన్ని నెమ్మదిగా రాస్తూ సంకో చంగా అంది. 'మిమ్మల్ని నేను అల్లా...' అప్రయత్నంగానే మాధవ్ ఆమె తలని గుండెలదగ్గరగా నొక్కుకోవటంతో సంధ్య నోట్లో మాటలు ఆగిపోయాయి.

'సంధ్యా' మృదువుగా అంటూ వంగి ఆమె కన్నీళ్ళు తుడిచిన మాధవ్ చెప్ప సాగాడు:

'నాకు తెలుసు సంధ్యా ... నీ మనసు కానీ...కానీ'...అతను అప్పుడే గుర్తు వచ్చిన వాడిలా తన గుండెల్లోని సంధ్యని జబ్బ దగ్గర గుచ్చినట్లుగా పట్టుకొని పైకి ఎత్తి ఆమెకీ తనకీ మధ్య కొద్ది దూరాన్ని సృష్టిస్తూ ఆమెను అంత దూరాన నిల బెట్టి కళ్ళల్లోకి వెతుకుతున్నట్లుగా చూశాడు.

కాని...సంధ్యా, నన్ను మర్చిపోయి సుఖ్యా వుండగలవా...నే కనిపిస్తే మాట్లాడవు కదూ ... పెళ్ళి చేసుకొని నాకు చాలా దూరంగా వెళ్ళిపోతావు. నే నెక్కడైనా కన్పిస్తే ముఖం తిప్పుకొంటావా... నిజమా ...సంధ్యా...'

సంధ్య కళ్ళు వాల్చుకొంది. ఆమె నుంచి ఏలాంటి జవాబూ రాలేదు. కాసేపు ఎదురుచూసిన మాధవ్ కనుబొమల మధ్య మెల మెల్లగా ముడిపడింది. అతని కళ్ళు తీక్షణంగా అయి ఆమెనుంచి వచ్చే జవాబు కోసం చాలా ఆత్రంగా ఎదురు చూడ సాగాయి. మాటలతో కాకపోయినా చూపు లతోనైనా ఆ భావాన్ని తెలుసుకొనే అవ కాశం నిరీక్షిస్తున్న భంగిమలోని అతను—

'ఒక్కసారి నా వైపు చూడు సంధ్యా' ఏలాగో అయిపోతూ అడిగాడు మాధవ్.

సంధ్య కనురెప్పలు పైకి లేచి అతన్ని చూడటానికి కానీ...అసలు కళ్ళెత్తడానికి కూడా శక్తి లేనట్టుగా అలాగే కిందకి వాలి వుండిపోయాయి. సగం సగం భూమి మీద పడుతూన్న వెన్నెల నీడలు ఆమె విశాలమైన కనురెప్పల మీద మెరుస్తు న్నాయి.

'తను అతనికెలా ముఖం చూపించ గలుగుతుందీ...అతని జీవితంలో ప్రవేశించి ఆశలు రేపి బాసలు చేసిన తను ఈనాడు అతని కుల ప్రసక్తివల్ల తనంత తానుగా

కాక కేవలం తల్లితండ్రులకోసం; ఈ సంఘంకోసం మాత్రమే అతన్ని విడిచి దూరంగా పారిపోతోందనీ, ఎంత దూరంలో వున్నా అతన్ని మాత్రమే ఆరాధించి ఆ స్మృతుల సాయంతో జీవితంలో ఎంత దురదృష్టకరమయిన సంఘటనల నయినా చాలా తేలిగ్గా భరించేయకలదనీ, అసలు అతన్ని విడిచి వెళ్ళడంతోనే తను శవ గ్రస్తగా మారిపోతుందనీ, మాధవ్ సీడన లేని సంధ్య కదిలే శవంలా అయిపోతుందని ఎలా చెప్పాలి ... అతనికేం తెలీదూ...' సంధ్యకి చుట్టూ మంటలు లేచి అవి తనని చుట్టు ముట్టి వాటి మధ్యనుంచి తప్పించుకోలేనట్లు అన్పించసాగింది. తన మీద తనకే అంతులేని అసహ్యం కలిగింది మొదటిసారిగా. పొంగివచ్చే దుఃఖాన్ని అదిమి పట్టే ప్రయత్నంలో సంధ్య క్రింది పెదవి పంటికింద నలిగిపోతోంది.

ఒక్కసారిగా ఈ బంధాలన్నీ తెంచుకొని, తనకోసం తపిస్తున్న మాధవ్ చెయ్యిపట్టుకుని ఎక్కడికో పారిపోతే...

అసలు దేవుడు తనని ఇంత పెద్ద కులంలో ఎందుకు పుట్టించాలి ..? పోనీ మాధవ్‌నయినా తన కులంలో పుట్టించకూడదా. తనే పొరపాటు చేసింది. ఇంట్లో ఆచారాలు తనకి తెల్సు. మొదటే అతని గురించి తెల్సుకుని వుండాల్సింది. స్వచ్ఛంగా మాట్లాడే ఆ తీరు సంస్కారంగల ప్రవర్తన ముందు తనకేం తెలిసేది కాదు. మాధవ్‌కోసం తన హృదయం ఎంతగా చూసేదో? అతని అడుగుల చప్పుడు వింటూ తన మనసు తన ప్రయత్నం లేకుండానే ఎంతగా పొంగేది? మాధవ్... మీకెలా చెప్పనూ?...

'సంధ్యా' జాలిగా పిలిచాడు మాధవ్.

"నేనంటే అసహ్యంగా వుందికదూ. నా ముఖం చూడటానిక్కూడా మీకు మనసు రావటంలేదు కదూ...' అతను నిస్పృహగా అంటూ ఆమె చెయ్యి వదిలేశాడు.

'ఎందుకలా మారిపోయింది సంధ్య. తన కులంగురించి తెలిసాకా ? ... ఒక్కసారి కళ్ళెత్తి తనవైపు చూసి 'నిన్ను మర్చిపోను' అని చెప్పకూడదూ ... కనీసం తన వైపన్నా చూడవచ్చుగా.'

ఉలిక్కిపడ్డాడు మాధవ్, సంధ్య ఏడుస్తోంది...

సంధ్య మోకాళ్ళ మధ్య ముఖం దాచుకొంది. ఆమెకి వుప్పెనలా ఏడుపు ముంచుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తున్న సంధ్య ఆ శబ్దం పైకిరాకుండా వుండటానికి విశ్వప్రయత్నం చేస్తోంది. 'ఎలా చెప్పను ఇతనికి ... ఏం చెప్పి ఓదార్చను... భగవాన్ నన్నింత నిస్సహాయురాలిగా ఎందుకు చేసావ్.'

'నన్ను మర్చిపోతావా సంధ్యా...' మాధవ్ కంఠం దీనంగా ప్రతిధ్వనిస్తోంది ఆమె హృదయంలో.

మాధవ్ తదేకంగా రెప్పవాల్చకుండా సంధ్యవయిపే చూడసాగాడు.

'ఇన్నాళ్ళు తను అపురూపంగా ఆరాధించిన సంధ్య ఇక తనది కాదు. ఈ నిజం కఠోరమైనదే అయినా, ఇది తన గుండెల్ని చీల్చి నిర్దాక్షిణ్యంగా ముక్కలు చేస్తోన్నా... ఇది నిజమే. నిజాన్ని కాదనగలిగే సాహసం తనకి లేదు. గాలిలో మేడ కట్టాడు తను. భూమిమీద ఆధారంలేని ఆ మేడ పగిలి గాలికెగిరి చెదిరిపోయింది, ఇప్పుడేం మిగిలింది. శిథిలమైన ప్రాణం. తన ప్రేమ మురదు అనురాగం ఎదుట ఏ కుల తాల గోడలు నిలువవు అనుకొన్నాడు. కాని అవే ఈనాడు తమ మధ్య దుర్భేధ్యమయిన కట్టడంలా నిలబడి తనని సవాల్ చేస్తోంది. నిస్సహాయంగా, బతికున్నాళ్ళు ఈబాధ సహించడం తప్ప మరేం చెయ్యగలడు. ఇంక జీవితంలో శాంతి తృప్తి ఇవ్వన్నీ ఎండమావుల్లా మారి వెక్కిరిస్తాయి కాబోలు.

అతను యుద్ధంలో చిత్తుగా ఓడిపోయి శరీరానికి తగిలిన గాయాలకంటే మనసుకి అపజయమనే కోలుకోలేని గాయం అయిన సామ్రాట్టులా వున్నాడు.

తను కోరితే అన్నీ వెదుక్కొని వచ్చేస్తుంది సంధ్య. కానీ అందువల్ల కొన్ని జీవితాలు అశాంతితో కుమిలిపోవడానికి కారణం తనే అన్న సంగతి మనసు అనుక్షణం గుర్తు చేస్తుంటే హాయిగా గడపగలడా. తను సుఖంగా నవ్వుతున్న వేళ... తనవల్ల ఒకళ్ళు బాధపడుతున్నారని వాళ్ళు



# కర్తవ్యం

కన్నీళ్ళు కాలాయి తనని దహిస్తున్నాయి.. క్షణం క్షణం చిత్రవధ అనుభవిస్తూ ఇట్లా బ్రతకటం...?

సంధ్యని తను ఎంత పువ్వుల్లో పెట్టి పూజించినా, తనవల్లనే మిగిలినవాళ్ళ బ్రతుకులు నాశనం అయ్యాయనీ, తల్లి తండ్రి అవమానంతో మంచంపట్టి వాళ్ళేమయినా అయి; ఆ కుటుంబం చెదిరి ...భగవాన్' మాధవ్ తల తిరిగిపోయింది. అప్పుడు సంధ్య తనని క్షమిస్తుందా. అసలు అప్పుడు తను ఆమెకెలా ముఖం చూపించగలుగుతాడూ ... ఓహ్...' మాధవ్ హృదయం అర్థంకాని బాధతో బరువెక్కింది.

ప్రేమ త్యాగం చేయటానికేనేమో...తన ఒక్కడికోసం కొందరి బ్రతుకులు బలి కావటం ఏమంత వాంఛనీయం!

'సంధ్యా...ఇటు చూడండి' అతని గొంతులోంచి వచ్చిన ఆ పిలుపుకి అప్రయత్నంగా తలెత్తి చూసింది సంధ్య. అందుకే ఎదురుచూస్తున్నట్లు మాధవ్ కళ్ళు. ఆమె చూపులతో కలసి ఆమె కళ్ళల్లోంచి మనసులోకిలా చొచ్చుకుపోయాయి. కాలం ఆగిపోయింది క్షణసేపు.

ఆ ఆ కలయికలో ఎంత శాంతో... జీవితంలో ఒకళ్ళకోసం ఒకళ్ళు వెతుక్కొని విసిగిపోయి విరక్తితో వెనక్కి తిరిగి, నిరాశ నిండిన మనసు, నాకోసం ఎవరూ లేరని రోదించే హృదయంతో, అలసిపోయిన వ్యక్తులు హఠాత్తుగా ఒకరికొకరు ఎదురైతే... పూర్తిగా ... ఒకలాంటిభావంతో కరువుతీరా చూసుకొన్నట్టుగా ... సంవత్సరాల తరబడి నిరీక్షణలో పేరుకొన్న కన్నీటి మంచుకొండ కరగి ఆ కొండలచాటున ఇంతకాలంగా నిశ్శబ్దంలో మునిగిపోయిన హృదయం వెలుగు జల్లుల్లో తేలిపోతున్నట్లు; ఇన్నాళ్ళూ పంజరంలో బంధింపబడిన పక్షి స్వేచ్ఛగా, రెక్కలు టపటపా కొట్టుకుంటూ ఎగిరి అంబరం అంచులనీ స్పృశించాలని కోరికతో పరవశంగా ఎగిరిపోతున్నట్లు... పెద్ద పెద్ద పూవులు వికసించి, ఆ పూలమధ్యనుంచి సాగే గాలి గాలితరంగంలోంచి వేణుగానం విన్పించినంత హాయిగా... భాష కందని భావం అది. నిర్వచనానికి దొరకని సందేశం అది. ఆనందానికి అపజయానికీ, అనురాగానికి, ఆవేదనకీ, ప్రేమకీ, వంచనకీ తేడా తెలియని ప్రత్యేక సన్నివేశం అది. రెండు వేదనా తప్త హృదయాల మీద పన్నీటిజల్లు కురిపించిన వేళ అది. జీవితంలో ఎప్పుడూ, చివరి దశలో కూడా పువ్వులు కురిపించేలా చేసే పవిత్ర సమావేశం అది. ఎర్ర జీరలతో, ఉబ్బిన ఆమె కళ్ళల్లోంచి ఏదో శక్తి అతని హృదయంలో ఇందాకట్నుంచి శూన్యంగా, వెలితిగా మిగిలినచోట చైతన్యాన్ని నింప సాగింది.

'సంధ్య తనని మరచిపోదు ఆ మాత్రం చోటు చాలు తనకి రాగమయి హృదయంలో.' సంధ్య ఎప్పుడూ సుఖంగా వుండాలి. పెద్ద హోదాలో వున్న భర్త, ముత్యాల్లాంటి పిల్లలతో సుఖంగా వుండాలి.' అంతకంటే ఇంకేం కోరుకోడు తను.

## శ్రీమతి తీర్పు

సిగరెట్టు త్రాగేటి ఓ మామగారు
చివరకు మీరేమి మిగిలించుతారు?
చిన్నారిమరదలికి యేమి ఇస్తారు?
నేనెరుగ నేనెరుగ మీ అత్తనడుగు!

అవకాశవాదులైన ఓ అత్తగారు
ఆకాశమందు యేమి వెదికేరు?
చిన్నారిమరదలికి యేమి ఇస్తారు?
నేనెరుగ నేనెరుగ మీఒదిననడుగు!

పట్నాల చదువుల ఓ ఒదినగారు
కట్నాల సంగతి యేమిటంటారు
చిన్నారిమరదలికి యేమి ఇస్తారు?
నేనెరుగ నేనెరుగ మీబావనడుగు!

నవ్యకళా ప్రపూర్ణులైన ఓ బావగారు
సవ్యముగ మీరేమి యోజించినారు
చిన్నారిమరదలికి యేమి ఇస్తారు?
నేనెరుగ నేనెరుగ మీ ఇల్లాలి నడుగు!

మాఇంటిమహాలక్ష్మి మాదొక్కమాట
మీ ఇంటివారెల్ల కూర్చుండి రిచ్చోట
చిన్నారిమరదలి మాట వినగోరెదము మీనోట
ఏమి సెలవిస్తారో నేం తెలుపండి!

ప్రియమైన శ్రీవారు నిజమేని మీ ప్రేమ
తెలిపెదను నేను తెల్లమ్ముగాను
మనకు ఇచ్చినదంత మాచెల్లికేనంత
లేకుండ పంచిన రాదండి యెవరికేమాట!

మనసైన మహాలక్ష్మిమన్నించుమాతప్పు
ఇన్నింటిలో మీతీర్పు మిన్నంటుకొనెను
ఇంటికొక్కరున్నను చాలు నీనువంటి వారు
ఇట్టి ఇక్కట్టులెన్నేని వెనువెంట తీరు!!

—డి. శేషగిరిరావు

మాధవ్ కళ్ళు క్రమంగా కాంతివంతం అయ్యాయి.

'మీ ఇష్టమే కానీండి సంధ్యా ... నేను బాగా ఆలోచించే చెప్తున్నాను. నావల్ల మీరు బాధ పడకూడదు సంధ్యా. మీరెప్పుడూ సుఖంగా వుండాలి. పెళ్ళికి నన్ను పిలుస్తారా...మీరు వద్దన్నా వచ్చి దీవించి వెళ్తాను. మీ జీవితాన్ని పంచుకునే ఆ అదృష్టవంతుడిని చూడాలి. మాట్లాడ వేం సంధ్యా. నే వస్తే భయమా...మన గురించి ఏమయినా చెప్తాననా... ?— అదేం కాదు. ఆయన్ని చూసి అసూయపడను సంధ్యా. పైపెచ్చు అభినందిస్తాను. మీలాంటి దేవతతో అనుక్షణం గడిపేయగల అవకాశం సంపాదించుకొన్నందుకు. అరె... ఏమిటలా చూస్తున్నారూ—?'

సంధ్య పెద్దవి కళ్ళతో చూస్తోంది. మెదడులో ఏదో గిర్రున తిరుగుతోంది. గ్రామ్‌ఫోన్ ప్లేట్‌లా అందులోంచి మాధవ్ మాటలు మళ్ళీ మళ్ళీ ప్రతిధ్వనించి విన వస్తున్నాయి. తల మీద పెద్ద బరువేదో పెట్టినట్లు ముందు బాధ అన్పించి క్రమంగా అలవాటయినట్లు మనసులోంచి ఏదో మత్తులాంటి తెర కళ్ళమీదకంటా జారుతూ ...ఆ మత్తులోంచి మాధవ్ మాటలు మధురంగా, గంభీరంగా, హృదయనివేదనంగా అతని మాటలు క్రమంగా మంద్ర స్థాయికి దిగి ఆ మత్తులో లీనంఅవుతూ...

'సంధ్యా...ఏమిటలా అయిపోతున్నారూ' మాధవ్ కలువకాడలా వాలిపోతూన్న ఆమెని పట్టుకొన్నాడు. స్పృహ తప్పి చేతుల్లో వాలిపోయింది సంధ్య.

* * *

సంధ్య కోరికతో వాసుని పెళ్ళి చేసుకొన్నాడు మాధవ్. అతను ఆమెకోసం ఏమయినా చేయగలడు. తను మాత్రం పెళ్ళి చేసుకోలేదు తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు చేసింది సంధ్య. ఆమె కాలేజీలో లెక్చరర్‌గా వుంటోంది. తల్లి, తండ్రి పోయారు. ఆఖరి తమ్ముడు ఒక్కడూ ఆమెతో వుంటున్నాడు. ఇప్పుడు ఉద్యోగరీత్యా చాలా వూళ్ళు తిరిగిన మాధవ్ ఏడాది క్రితమే ఆ వూరు వచ్చాడు.

వాసుకి చాలాకాలం తర్వాత సునీల్ పుట్టాడు. వాడికి తల్లి దగ్గరకంటే సంధ్యంటేనే చనువు, సంధ్యని వచ్చి తా

మాటల్లో 'అమ్మా' అంటూంటే సంధ్య మనసు పరవశించేది. సునీల్‌కి రెండోయేడు వెళ్ళింది. వాడికి సంధ్య దగ్గర వుండటం చాలా ఇష్టం.

సంధ్య లేచి స్లీపింగ్ పిల్ వేసుకొని తాత్కాలికంగా ఉపశాంతి పొందింది.

మాధవ్ పొడికళ్ళతో శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు. వాసవి గట్టిగా అనుకొంది. 'పిల్లేదు, సంధ్య ఒంటరిగా అందరిచేతా మాటలుపడుతూ వుండడాన్కి వీల్లేదు.'

* * *

'వాసూ ఏమిటి...నువ్వు...నువ్వు... ఏం మాట్లాడుతున్నావ్...'

'అవును సంధ్యా' వాసవి నిశ్చలంగా చూసింది. 'నీ పెళ్ళి గురించి మాట్లాడుతున్నాను...' నవ్వొల్లా విన్నావుల్లా గడుపుతావ్. మొన్నటికి మొన్న ఆ వనితా విహార్ వాళ్ళు...'

'ఓ అదా సంగతి...' సంధ్య కాంతి నిండిన కళ్ళతో చూసింది.

'పిచ్చి తల్లీ... నా వయసెంతో తెల్సా.'

'ఇరవై ఏనిమిదేగా...నువ్వు ఇరవై ఏళ్ళ పిల్లలా వున్నావు సంధ్యా' అందంగా, ఆరోగ్యంగా వున్న ఆమెను చూస్తూ అంది వాసవి.

'నోర్మూసుకో వాసూ ... ఇంకెప్పుడూ అలా అనకు, నాకు పెళ్ళేమిటే నీ మొహం.'

'కాదు సంధ్యా, సీరియస్‌గా చెప్తున్నాను. నువ్వు లోకంకోసం అయినా పెళ్ళి చేసుకోవాలి.'

'పాడులోకం సంగతి నాకు చెప్పకు వాసూ. ఈ లోకం కోసమే నేనిలా మిగిలిపోయాను నీకు తెలీదా వాసూ...మానిన గాయాన్ని కెలుకుతున్నావ్' సంధ్య కళ్ళ నుంచి రెండు వెచ్చని అశ్రువులు వేగంగా జారి సునీల్ తల మీద పడ్డాయి.

'క్షమించు సంధ్యా...నా వుద్దేశం అది కాదు. ఇప్పుడేం అన్పించకపోయినా జీవితం చివరి దశలో నీ నకంటూ ఓ తోడు పిల్లలు లేరే అన్పిస్తుంది. నేను ఇంకోళ్ళ సంగతి చెప్పటంలేదు సంధ్యా. నువ్వు అయున్నే చేసుకో...'

'వాసవీ...' కేకలేసుంది సంధ్య.

'వాసవీ... నువ్వేం మాట్లాడుతున్నావో తెల్సా...? మాధవ్ ఇంకా అలా గుర్తులేరు నాకు. ఆయన నీ భర్త అంతే. కాకింకేం ఆశలూ లేవు. మీ ఇంటికి ఇవ్వాళ్ళానిని అలా మాట్లాడుతున్నావా భయపడకు...నే నింక రానులే వాసవీ... మీకెవరికీ కన్పించనంత దూరంగా పోతానులే...'

'సంధ్యా...'

అంతవరకూ ఆ సంభాషణని ప్రక్క గదిలోంచి వింటూన్న మాధవ్ రెండంగల్లో అక్కడికి వచ్చేశాడు,

'ఓ...మీరూ ఇక్కడే వున్నారా'... పాముకాటు తిన్నదానిలా వణికింది సంధ్య. 'ఒక్క నిమిషం కూర్చోండి సంధ్యా' మాధవ్ మాటలతో ఆమెను కూర్చోబెట్టేశాడు. 'వనితావిహార్ సంఘటన విన్నాక వాసవి చాలా బాధపడింది సంధ్యా. ఆ మాటే నాతోనూ చెప్పింది. నేను వాదించినా వినలేదు, 'ఆనాడు తల్లి తండ్రులకోసం, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకోసం నాకు మిమ్మల్ని త్యాగం చేసింది సంధ్య. ఈనాడు తనకా బంధాలు లేవు. సంధ్యని మీరెందుకు చేసుకోకూడదూ...' ఇది తన వేదన సంధ్యా! వాసవి చాలా ఉత్తమురాలు సంధ్యా. తనలాంటి దేవతని నాకు ప్రసాదించిన మీ ఋణం తీర్చుకోలేను. సంధ్యా మమ్మల్ని అపార్థం చేసుకోకండి. నాకు మీ మీద వేరేలాంటి ఉద్దేశం లేదండీ. మేం మీ శ్రేయోభిలాషులం. మీరు రావటం మానేస్తే మామీద ఒట్టే. మాకోసం కాకపోయినా సునీల్ బాబు మిమ్మల్ని విడిచి వుండగలడా...'

'వాసూ ... నన్ను క్షమించు. నిన్ను అర్థం చేసుకోలేకపోయాను.'

సంధ్య వాసవిని కౌగిట చేర్చుకొంది 'నాకో వరం ఇయ్యి వాసూ. అడగరానిదే అయినా అడుగుతున్నాను. సునీల్‌ని నాకిచ్చెయ్యండి, నా జీవితం చివరిదశ అంతా వీడివేతుల్లో వెడితే ఇంకేం అక్కర్లేదునాకు.'

'అలాగే సంధ్యా తీసేసుకో వీడు నీకొడుకే...' వాసవి మాధవ్ ఒకేసారి అన్నారు.

* * *

ఢిల్లీలో వుమెన్స్ వెల్‌ఫేర్ ఆఫీసర్‌గా ఇదివరకెప్పుడో అప్లై చేసిన ఉద్యోగం వచ్చింది సంధ్యకి.

ఓ ప్రశాంత వేళ. తెల్లని వెలుగులు లోకంనుంచి మెల్లగా పరచుకొంటూన్న బంగారు వేళ...

రాత్రి రాలిన హిమబిందువుల్లోంచి వేడి కిరణాలు దూసుకుపోతూ... ఆలయ శిఖరాల అంచులమీంచి జారుతూ లోకాన్ని పవిత్రంగా జీవించే ప్రత్యూష వేళ...


ప్రతి ఆకులో, పూవులో, తీగలో, గాలిలో నేలమీదా—అణువణువులో ప్రశాంతత వెల్లివిరిసే వేళ, చిన్నారి సునీల్‌తో ప్రయాణం అయింది సంధ్య.

* * *

చెప్పటం ఆపి కొడుకు ముఖంలోకి చూసింది అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్యారాణి.

నాలుగేళ్ళ క్రితం అమెరికా వెళ్ళిన మాధవ్ బాబాయి, వాసవి పిన్ని తల్లీ తండ్రీలా ఇంత విన్నాక కూడా సునీల్‌కి అన్పించలేదు. తల్లీ తండ్రి తనే అయి పెంచిన సంధ్య చిరునవ్వు ముఖమే అతని మనసులో నిండింది. సునీల్ రెండు నిమిషాలు తల్లి ముఖంలోకిచూసి వంగి ఆమె పాదాలు తాకాడు. 'నా కర్తవ్యం తెల్పిందమ్మా'...

(అయిపోయింది) ●




[illegible]